


# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 06-03-2024 సంపుటి : 06 సంచిక : 176 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఎన్నికల తరువాత విశాఖనుండే పాలన

## ఏపీ సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు..

అమరావతి మార్చి 05 ( విభారే) : వచ్చే ఎన్నికల అనంతరం వైజాగ్ నుంచే పాలన సాగిస్తానని ఏపీ సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. మళ్లీ గెలిచి వచ్చాక వైజాగ్‌లోనే ప్రమాణ స్వీకారం చేస్తానని అన్నారు. విశాఖ అభివృద్ధికి అన్ని విధాలుగా కట్టుబడి ఉంటానన్నారు. మంగళవారం విజన్ వైజాగ్ పేరిట పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌ను కోల్పోయామని దాని ప్రభావం ఏపీపై ఎంతో ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైజాగ్ నగరం హైదరాబాద్ కంటే మిన్నగా అభివృద్ధి జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీకి సముద్రతీర ప్రాంతాల రాయపట్నం, కాకినాడ, మూలపేట, మచిలీపట్నం పోర్టులు ఉన్నాయని వీటిని పారిశ్రామికంగా, పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే రాష్ట్రం అన్నింటా పరుగులు పెడుతుందని అన్నారు. అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదని.. అమరావతి శాసన రాజధానిగా కొనసాగుతుందని సీఎం



జగన్ తెలిపారు. అమరావతిలో మౌళిక సదుపాయాలా కల్పనకు లక్ష కోట్లు కావాలన్నారు. ఒక్క ఎకరాలకు రెండు కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. తాము చేపట్టిన నూతన పారిశ్రామిక విధానాల వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో 30 లక్షల ఉద్యోగాలు వచ్చాయని. వెల్లడించారు. కొందరు తమ స్వార్థ రాజకీయాలతో కోర్టు కేసులు వేస్తూ సంక్షేమ పథకాలను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని ధ్వజమెత్తారు.

# శ్రీనివాసమంగాపురంలో వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తిరుపతి : శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్రీనివాసుడు శ్రీరాములు వారి అలంకారంలో హనుమంత వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. మధ్యాహ్నం శ్రీవారి కల్యాణ మండపంలో వసంతోత్సన్ని ఘనం గా నిర్వహించారు. వాహనసేవ లో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, వైఖానస



ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు. 12 కంపార్టుమెంట్లలో భక్తులు తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిన్న శ్రీవారిని 70,570 మంది భక్తులు దర్శించుకోగా 22,490 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం(ఊబీనిటతి ఎనిఇనీఎవ) రూ. 3.76 కోట్లు వచ్చిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 12 కంపార్టుమెంట్లలో వేచియుండగా టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు వివరించారు.

# 'ఆంధ్రప్రదేశ్ టెట్, డీఎస్సీ 2024 షెడ్యూల్ మార్చండి..'


## రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం




అమరావతి, మార్చి 5: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ-డీఎస్సీ)ల షెడ్యూల్‌ను వెంటనే మార్చాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు సోమవారం (మార్చి 4) ఆదేశించింది. హడావుడిగా పరీక్షలను నిర్వహిన్నట్లు ఉందని, టెట్ పరీక్ష చివరి తేదీ నుంచి డీఎస్సీ పరీక్ష ప్రారంభానికి మధ్యలో కనీసం 4 వారాల సమయం ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది. అలాగే ప్రాథమిక కీ విడుదల తర్వాత అభ్యంతరాల స్వీకరణకు కనీసం వారం రోజుల గడువు ఉండేలా హెడ్యూల్‌ను రూపొందించాలని కోర్టు పేర్కొంది. ఈ మేరకు టెట్, డీఎస్సీ షెడ్యూల్‌లను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ఆదేశించింది. పేపర్1 ఎస్జీటీ అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇచ్చిన ఉత్తర్వులు ఈ పోస్టుల భర్తీ ప్రక్రియలోనే వర్తిస్తాయని కోర్టు స్పష్టత ఇచ్చింది. ఏపీ టెట్ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 8న జారీ చేయగా, అదే నెల 27 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కోర్టు గుర్తు చేసింది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 12న జారీ చేసి, పరీక్షలు మార్చి 15 నుంచి నిర్వహించబోతున్నారని తెలిపింది. టెట్, డీఎస్సీ పరీక్షల విషయంలో ప్రాథమిక కీపై అభ్యంతరాల స్వీకరణకు తగిన సమయం ఇవ్వాలని సూచించింది. అభ్యంతరాల స్వీకరణ అనంతరం, వాటి పరిష్కారం, తదనంతరం జారీ చేసే తుది కీ విడుదలకు అత్యంత తక్కువ సమయం ఇచ్చారని కోర్టు అభిప్రాయపడింది. ఈ విధమైన నిర్ణయం సహేతుకంగా లేదని, అభ్యర్థులకు సముచిత సమయం ఇవ్వకపోవడం అనేది రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను హరించడమేనని న్యాయస్థానం తెలిపింది.

**గత డీఎస్సీకి 2 నెలల గడువు.. ఇప్పుడెందుకీ హడావిడి?** 2018లో జరిగిన టెట్, టీఆర్టీ మధ్య తగిన సమయం ఇచ్చారని కోర్టు పేర్కొంది. డీఎస్సీ నోటిఫికేషన్ తేదీకి, పరీక్ష నిర్వహణకు మధ్య 60 రోజుల సమయం ఇచ్చారని పేర్కొంది. కానీ ఇప్పుడు మాత్రం హడావిడిగా నిర్వహిస్తున్నట్లుగా ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఆ నోటిఫికేషన్ షెడ్యూల్‌లో ప్రాథమిక కీ విడుదల నుంచి అభ్యంతరాల స్వీకరణ, తుది కీ జారీకి మధ్య సహేతుకమైన సమయం ఇచ్చారని ఈ సందర్భంగా కోర్టు వెల్లడించింది. ఈ ఏడాది ఇచ్చిన ప్రస్తుత నోటిఫికేషన్ విషయంలో కూడా అధికారులు ఆ తరహా షెడ్యూల్‌ను పాటించాలని అభిప్రాయపడింది. సమయాన్ని కుదిస్తూ, షెడ్యూల్ కుదించి, హడావిడిగా ఎందుకు నోటిఫికేషన్ ఇచ్చారో తమకు అర్థం కావడం లేదని కోర్టు సందేహం వ్యక్తం చేసింది. ఇలాంటి ప్రక్రియ వల్ల పరీక్షల నిర్వహణ ఉద్దేశాన్ని దెబ్బతీశారని, కోర్టు ఆదేశించిన మేరకు ప్రతి దశలో తగిన సమయమిస్తూ షెడ్యూల్ మార్చాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ తీర్పు సందర్భంగా వెల్లడించారు.

# టీడీపీ-జనసేన 'జయహో బీసీ' సభ..



అమరావతి మార్చి 05 ( విభారే) : తాడేపల్లిగూడెంలో టీడీపీ-జనసేన ఉమ్మడి సభ సక్సెస్ కావడంతో అదే ఊపులో గుంటూరు జిల్లా మంగళగిరిలో నేడు జయహో బీసీ సభ నిర్వహించనున్నారు. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా నిర్వహించే జయహో బీసీ సభ ఏర్పాట్లను ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పరిశీలించారు. సభకు టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ హాజరుకాబోతున్నారు. రెండు పార్టీలకు చెందిన 19 మంది నేతల కమిటీ తయారుచేసిన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌ను మంగళగిరి సభలో విడుదల చేస్తారు. బీసీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా బీసీ డిక్లరేషన్ తయారుచేశామని రెండు పార్టీల నేతలంటున్నారు. అధికారంలోకి వస్తే బీసీల కోసం అమలు చేయబోయే పథకాలను సభలో వివరిస్తారు. 3 లక్షల మంది కార్యకర్తలు, అభిమానులు తరలివస్తారని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎన్టీఆర్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు తెలుగు దేశం బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ వస్తోందన్నారు అచ్చెన్నాయుడు. ఇప్పటికే టీడీపీ సూపర్ సిక్స్‌లో బీసీ రక్షణ చట్టానికి హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తే బీసీ కులగణనకు హామీ ఇచ్చే అవకాశం ఉందని మంగళగిరి సభలో ప్రకటించే అవకాశముంది. మరోవైపు వైసీపీ ప్రభుత్వం ఇప్పటికే కులగణన ప్రక్రియలో ఉంది. దీంతో నేటి సభలో టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌లో బీసీ కులగణనపై స్పష్టమైన ప్రకటన చేసే అవకాశముంది. వైసీపీకి ధీటుగా బీసీలకు పథకాలు ప్రకటించే అవకాశముందని టీడీపీ-జనసేన వర్గాలంటున్నాయి. పార్టీలన్నీ బీసీ మంత్రం జపిస్తున్న తరుణంలో టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్‌లో ఏఏ అంశాలుంటాయనే దానిపై బీసీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# సిఎం జగన్‌కి ఉన్న నిబద్ధత ఎవరికీ లేదు: సజ్జల



అమరావతి,మార్చి5: ఆయా వర్గాల్లో నాయకత్వం పటిష్టత కోసం ముఖ్యమంత్రి జగన్ ఎంతో కష్టపడ్డారని.. జగన్‌కి ఉన్న నిబద్ధత మరెవ్వరికీ లేదని ఎపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వడ్డెర ఆత్మీయ సమావేశంలో సజ్జల మాట్లాడుతూ.. అన్ని వర్గాల మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వారి నాయకత్వ పటిష్టకు చట్టం చేసి మరీ చర్యలు తీసుకున్నారని చెప్పారు. 2014 ఎన్నికల తర్వాత 23మంది వైసిపి ఎమ్మెల్యేలను లాక్కొని జగన్ ను తొక్కాలని చంద్రబాబు కుట్ర చేశాడని.. అయినా, జగన్ నిలబడ్డారని అన్నారు. ఇన్నేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు బిసిలకు గురించి మాట్లాడలేదని.. ఇప్పుడు అధికారం కోసం బీసీలపై ప్రేమ పుట్టుకొచ్చి హామీలను ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబుకు బలం ఉంటే.. పొత్తులు ఎందుకు పెట్టుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు.

# తిరువూరులో ఎన్నికల ప్రచారం పీక్స్..

## నువ్వా-నేనా అంటూ దూసుకుపోతున్న ప్రధాన పార్టీలు



ఎన్టీఆర్‌జిల్లా తిరువూరు నియోజకవర్గంలో ఎన్నికల వేడి పీక్స్‌కి వెళ్తోంది. ఈ సెగ్మెంట్‌లో విజయకేతనం ఎగురవేయాలని అటు వైసీపీ ఇటు టీడీపీ పట్టుదలతో ఉన్నాయి. నోటిఫికేషన్ సంగతి పక్కనపెట్టి ప్రచారంలో దూసుకుపోతున్నాయి. వైసీపీ ఇన్‌ఛార్జ్ స్వామిదాస్ గడపగడపను టచ్ చేస్తుంటే.. టీడీపీ ఇన్‌ఛార్జ్ కొలికపూడి శ్రీనివాస్ సమావేశాలతో ప్రజలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ నేతల సమావేశంలో కొలికపూడి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. స్వామిదాస్ టార్గెట్‌గా వ్యక్తిగత దూషణలకు దిగారాయన. కొలికపూడి కామెంట్లకు గట్టిగానే బదులిచ్చారు స్వామిదాస్. అమరావతి రైతుల దగ్గర డబ్బు వసూలు చేసిన బ్లాక్‌మెయిలర్ తమపై విమర్శలు చేయడమేంటని విరుచుకుపడ్డారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపైనా విమర్శలు చేసుకుంటే పర్లేదు. కానీ వ్యక్తిగత దూషణలకు దిగుతూ కుటుంబసభ్యుల్ని టార్గెట్ చేయడం సరికాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**హీటెక్కిన ఏపీ రాజకీయాలు :** కాగా కొద్దిరోజుల క్రితం జనసేన పార్టీ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ చెప్పు చూపించారు. పెళ్ళిళ్ల ప్రస్తావన తీసుకురావొద్దని వైసీపీ నేతల్ని హెచ్చరించారు. దీనికి కౌంటర్‌గా మాజీ మంత్రి పేర్ని నాని రెండు చెప్పులు చూపించారు. ప్రజల్ని నమ్ముకుంటేనే అసెంబ్లీకి వెళ్తారని.. పక్క పార్టీ నేతల్ని నమ్ముకుంటే అసెంబ్లీ గేటు కూడా టచ్ చేయలేవని హితవు పలికారు. ఆ తర్వాత చెప్పు రాజకీయం ఏపీని హీటెక్కించింది. మళ్లీ చాలా రోజుల తర్వాత పొలిటికల్ తెరపై చెప్పు ప్రత్యక్షమైంది. అది కూడా ఎంపీ మార్గాని భరత్ చేతిలో. రాజమండ్రి సిటిలో జరిగిన సిద్ధం సభలో చెప్పు చూపించి మరీ వార్నింగ్ ఇచ్చారాయన. టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకి మార్గాని ఇచ్చిన వార్నింగ్ ఇది. మహిళా వాలంటీర్‌ను బెదిరించారని ఆడియో వినిపించి మరీ చెప్పు చూపించారు.



ఆలూరు మండల కేంద్రములోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆలూరు నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మెటీరియల్ డిస్పాచ్ సెంటర్ ను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి. సృజన

# సంపాదకీయం

బుధవారం 06-03-2024

## టార్గెట్ సౌత్ వ్యూహం ఏంటీ

ఊరకరారు మహానుభావులు–అన్నట్టుగా అగ్రనాయకులు ఒక రాష్ట్రానికి వచ్చారంటే చాలా ముందు వెనుక ఆలోచిస్తారు. పైగా.. 'మీకిది–మాకది' అన్నట్టుగా మారిపోయిన రాజకీయాల్లో నాయకులు ఊరికేనే ఏమీ చేయరు. ఈ నేపథ్యంలో అత్యంత బిజీ షెడ్యూల్‌లో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు రోజుల పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటనను పెట్టుకున్నారు. వరుసగా ఆయన మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. తెలంగాణ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు ఎనలేని ప్రాధాన్యం ఇచ్చారు. దీని వెనుక చాలానే వ్యూహం ఉందని అంటున్నారు పరిశీలకులు. తెలంగాణలో గత ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అధికారంలోకి రావాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించుకుంది. అయితే, అనూహ్యంగా ఈ వ్యూహం సక్సెస్ కాలేదు. కానీ, అనుకున్నస్థాయి కంటే కూడా ఎక్కువ స్థానాలు గెలుచుకుని.. బీజేపీ బలపడుతోందనే సంకేతాలు పంపించింది. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మొత్తం తెలంగాణ 17 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. వీటిలోనూ ఎస్సీ, ఎస్టీలు ఉన్న ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి కీలకమైన లోక్ సభస్థానాలపై రాజకీయ పక్షాల దృష్టి ప్రధానంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో పర్యటన.. పైగా ఆదివాసీలు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్‌లో 56 వేల కోట్ల రూపాయల అభివృద్ధిపనులకు శంకు స్థాపనలు వంటివి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసంలో కనీసం.. 17 స్థానాలకుగాను 10 చోట్ల అయినా విజయం దక్కించుకుని తీరాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్న దరిమిలా.. ప్రధాని పర్యటనకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఇక, ఆయన సోమవారం ఒక్కరోజుతోనే తన పర్యటనను ముగించుకోవడం లేదు. మంగళవారం మరోసారి తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్ లో పలు అభివృద్ధి పనులకు మళ్లీ శ్రీకారం చుట్టనున్నారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలో కూడా ప్రధాని పర్యటిస్తారు. ఇదంతా కూడా ఎన్నికల వ్యూహంలో భాగంగానే జరుగుతున్న పర్యటనగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడులోనూ ఈ సారి.. బలమైన పక్షంగా బీజేపీ ఎదగాలని నిర్ణయించుకుంది. ఈ రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 39 ఉన్నాయి. గత 2019 ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కేవలం ఒకే ఒక్క స్థానంలో విజయం దక్కించుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి ఇక్కడ బలంగా పుంజుకోవాలని భావిస్తున్న బీజేపీ.. ప్రత్యేక దృష్టి పెట్టింది. "కాశీ తమిళ సంగమం" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించి.. ఇక్కడి వారిని కాశీకి తీసుకువెళ్లి విశ్వనాథుని దర్శనం చేయించడంతోపాటు.. వారితో ప్రధాని మమేకమయ్యారు. ఇక, కొన్నాళ్ల కిందట ప్రధాని మోడీ ఇక్కడ నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే, ఆయన మూడోసారి కూడా వారణాసినే ఎంచుకున్నారు. రేపు ఒకవేళ.. మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని బావిస్తే.. ఆల్టర్నేట్‌గా తమిళనాడునే ఎంచుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రధాని తమిళనాడు పర్యటనకు అత్యంత ప్రాధాన్యం పెరిగింది. ఒడిశాలోనూ ప్రధాని పర్యటించనున్నారు. ఇక్కడ ఈ ఏడాది ఏపీతోపాటు అసెంబ్లీ ఎన్నికలు జరగను న్నాయి. పైగా ఇక్కడ బీజేపీకి తెలంగాణలో మాదిరిగా బలమైనవాయిస్ వినిపించే నాయకులు కూడా ఉన్నారు. మరోవైపు.. అధికార బీజేడీలో నాయకత్వ పరిస్థితి డోలాయమానంలో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్ వృద్ధుడు కావడం, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండడం.. తమిళనాడుకు చెందిన ఓ ఐఏఎస్ అధికారినీ వీఆర్ ఎస్ తీసుకునేలా ప్రోత్సహిం చి ఆయనకు పార్టీ పగ్గాలు అప్పగించడం వంటి పరిణా మాలు ఆసక్తిగా మారాయి. ఈ నేపథ్యంగా ఆ గ్యాప్‌ను తమకు అనుకూలంగామార్చుకుని పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మేలు చేకూర్చుకునే వ్యూహంతో ప్రధాని ఇక్కడ పర్యటనలకు షెడ్యూల్ ఖరారు చేసుకున్నారనేది పరిశీలకుల అంచనా.

# శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు..

## స్వామి, అమ్మవార్లకు టీటీడీ పట్టు వస్త్రాలు సమర్పణ



శ్రీశైలం మార్చి 05 ( విభారే) ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున భక్తులకు వసతీ గదులను నిర్మించేందుకు శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి సహకరించేందు సిద్దంగా ఉన్నామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ ధర్మారెడ్డి అన్నారు.శ్రీశైలంలో వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున పట్టు వస్త్రాలు శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేశం సస్యశ్యామలంగా ఉండాలని శ్రీశైలం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వారిని కోరుకున్నామని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అన్నారు ముందుగా ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆలయ ఈవో పెద్దిరాజు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు.టీటీడీ చైర్మన్ పట్టు వస్త్రాలను తలపై పెట్టుకొని స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఈఓ ధర్మారెడ్డికి శ్రీశైలం ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఈవో పెద్దిరాజు స్వామిఅమ్మవార్ల జ్ఞాపకను అందజేయగా అర్చకులు వేదపండితులు తీర్థప్రసాదాలిచ్చి ఆశీర్వదించారు. శ్రీశైలం దేవస్థానంలో భక్తుల కోసం రెండు వందల రూములు నిర్మాణం చేసేందుకు సిద్దంగా ఉన్నామని శ్రీశైలం దేవస్థానం తరుపున లెటర్ పంపిస్తే బోర్డు మీటింగ్ లో పెట్టి తీర్మానం చేస్తామని ఈఓ ధర్మారెడ్డి అన్నారు.

## అభివృద్ధి చూసే పార్టీలో చేరా భూమా కిషోర్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్సిపి నాయకులు భూమా కిషోర్ రెడ్డిబీజేపీ లో బరోసా కరువైందిపద్ధతిగల రాజకీయాలు చేసుకో

ఆళ్ళగడ్డ ప్రతినిధి మార్చి 05 విభారె న్యూస్ :– అభివృద్ధి చూసే పార్టీలో చేరా అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తా రాష్ట్రంలో వైకాపా చేస్తున్న అభివృద్ధి చూసే వైఎస్ఆర్సిపిలో చేరానని భూమా కిషోర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్వగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి విధానాలు చేస్తున్న అభివృద్ధి చూసి వైఎస్ఆర్సిపి లో చేరాను అన్నారు. బిజెపి కోసం ఐదు సంవత్సరాలు కష్టపడిన ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామా లేదా అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొని ఉందన్నారు. మోడీ చేస్తున్న అభివృద్ధి చూసి బిజెపిలో రాజకీయ భవిష్యత్తు ఉంటుందన్న ఆశతో చేరితే పార్టీలో ఎలాంటి భరోసా లేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి లేదని ఆయన విమర్శించారు. కనీస మద్దతు కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి బాగా జరుగుతోందని అయితే నియోజకవర్గంలో పనులు ఆలస్యం అవుతున్నాయని అదే విషయాన్ని తాను ప్రశ్నించానన్నారు. వైకాపా రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పటి నుండి బాగా అభివృద్ధి రూపంగా అన్నారు. ముఖ్యంగా నాడు నేడు పేరుతో పాఠశాలలు, అలాగే వైద్యశాలలు కూడా అభివృద్ధి చెందుతున్న అన్నారు. దళారీలు లేకుండా వాలంటీర్ల వ్యవస్థ చాలా బాగుంది అన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే ఓట్లు చిలిపోతాయని తద్వారా తన ప్రత్యర్థి లబ్ధి పొందే అవకాశం ఉందని అలా జరగకూడదని వైఎస్ఆర్సిపిలో చేరానన్నారు. తనమీద సామాజిక మాధ్యమాల్లో టిడిపి నాయకులు ట్రోల్స్ చేస్తున్నారని ఇది మంచిది కాదన్నారు. టిడిపి నాయకులు పద్ధతిగా రాజకీయం చేయాలని లేని పక్షంలో ఎవరి చరిత్ర ఏంటో బయటపెడతా నన్నారు. ఇదే చివరి హెచ్చరికని ఆయన పేర్కొన్నారు. మరో నాలుగు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిసానని తన మీద ట్రోల్స్ ఆగని పక్షంలో మీ చరిత్ర మీడియా ముందు ఉంచుతానన్నారు. కార్యకర్తలతో సంప్రదించే వాళ్లకు నచ్చచెప్పుకొని వైకాపాల చేరినట్టు అని పేర్కొన్నారు.

# మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు హైకోర్టులో చుక్కెదురు



హైదరాబాద్: మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. తనకు ప్రాణ హాని ఉందని శ్రీనివాస్ గౌడ్ హైకోర్టులో పిటిషన్ వేశారు.తనకు 4+4 గన్‌మెన్లను కేటాయించాలని పిటిషన్‌లో కోరారు. శ్రీనివాస్‌గౌడ్ వేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అభ్యర్థనను హైకోర్టు నిరాకరించింది.ప్రతి ఒక్కరికి ఈ విధంగా కేటాయించడం సాధ్యం కాదని హైకోర్టు పేర్కొంది. శ్రీనివాస్ గౌడ్‌కు గన్‌మెన్లు అవసరమో? లేదో? తెలపాలని హైకోర్టు డీజీపీని ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలనీ హైకోర్టు డీజీపీని ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు.. మార్చి 19కి వాయిదా వేసింది.

# ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు

## ఆళ్లగడ్డ ఎన్నికల అధికారి మల్లికార్జున రెడ్డి



ఆళ్ళగడ్డ ప్రతినిధి మార్చి 05 విభారె న్యూస్ :– ప్రశాంత వాతావరణంలో ఓటరు తన ఓటు వేసుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని నంద్యాల ఆర్డిఓ, ఆళ్లగడ్డ ఎన్నికల అధికారి మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ తహసిల్దార్ కార్యాలయంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. ఇప్పటికే ఈ కేంద్రాల్లో ప్రశాంత ఎన్నికలకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ షేక్ నజీర్ అహ్మద్, ఎన్నికల ఉప తహసిల్దార్ చంద్రశేఖరయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## డబ్ల్యూ గోవిందిన్నెలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని దొర్నిపాడు మండలం డబ్ల్యూ. గోవిందిన్నె గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి రెడ్డి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బయటకు చూస్తే అదొక మందుల షాపు..

### కానీ లోపల జరిగేది బిత్తిరి యవ్వారం..

పేదోడి వ్యాధులను టార్గెట్ చేసుకుంటూ సాగుతున్న అక్రమ మెడిసిన్ దందాపై తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. చూపరులను ఆకట్టుకునేలా తప్పుడు ప్రకటనలు చేస్తున్న నకిలీ మెడిసిన్‌పై డ్రగ్ కంట్రోల్ దృష్టి సారించారు.మనుషుల జబ్బులకు ఈ ప్రత్యేక ఆయిల్ వాడితే మటుమాయం అవుతాయని నమ్మబలికే మాటలు చెప్పి ఆయిల్ తయారు చేసి అమ్ముతున్న ముఠాకు చెక్ పెడుతున్నారు డ్రగ్ కంట్రోల్ అధికారులు.తెలంగాణలో గత మూడు నెలల నుంచి డ్రగ్ కంట్రోల్ అధికారులు సోదాలు ఎక్కువయ్యాయి. అనధికారిక నిల్వలు, ఇల్లీగల్ డ్రగ్ కార్యకలాపాలు, ఎటువంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మెడికల్ షాపులు, కల్తీ మెడిసిన్ లాంటి వాటిపై దృష్టి సారించిన డ్రగ్ కంట్రోల్ అధికారులు.. ఆకస్మిక తనిఖీలు చేస్తూ పలు మెడిసిన్స్ పట్టుకుంటున్నారు. తెలంగాణలో డ్రగ్ కంట్రోల్ అధికారులు రెండు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసారు. హైదరాబాద్‌లోని శాలిబండలో తనిఖీ చేసి అయో ఆర్గానిక్ ఆల్మండ్ ఆయిల్, ఆయో ఆర్గానిక్ వాల్‌నట్ ఆయిల్, అయో ఆర్గానిక్ కలోంజి ఆయిల్స్ సీజ్ చేసారు. నల్గొండ జిల్లా ఇర్కిగూడెం గ్రామం దామెరచర్ల మండలంలో ఓఆర్ఎంపి వద్ద 45 వేల రూపాయల మెడిసిన్స్ సీజ్ చేసారు. ఇలా నకిలీ మెడిసిన్స్, కల్తీ వాటిపై దృష్టి సారించి సీజ్ చేస్తూ నిర్వాహకులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు కేసు నమోదు చేసారు. తప్పుడు ప్రకటనలు చేస్తున్న షాపులు, మెడిసిన్‌పై దృష్టి సారించిన



తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు, అయో ఆర్గానిక్ ఆల్మండ్ ఆయిల్, ఆయో ఆర్గానిక్ వాల్‌నట్ ఆయిల్, అయో ఆర్గానిక్ కలోంజి ఆయిల్స్ పేరుతో నకిలీవి తయారు చేస్తున్నారని గుర్తించారు. మనుషుల వ్యాధులకు సంబంధించి క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం జబ్బులు మాయమవుతాయంటూ తప్పుడు ప్రకటనలు చేస్తుండడంతో హైదరాబాద్ శాలిబండలో పక్కా సమాచారం మేరకు హైదరాబాద్ జోన్ డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. అయో ఆర్గానిక్ ఆల్మండ్ ఆయిల్, ఆయో ఆర్గానిక్ వాల్‌నట్ ఆయిల్, అయో ఆర్గానిక్ కలోంజి ఆయిల్స్ అన్ని బాటిల్స్‌ని సీజ్ చేసారు. పట్టుబడ్డ స్టాక్ మొత్తం 21 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే ఇలాంటివి ఎక్కువగా అనారోగ్య బారిన పడేలా చేస్తాయని, క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం, ఊబకాయం జబ్బులు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఇలాంటి తప్పుడు ప్రకటనలను నమ్మొద్దని డ్రగ్ కంట్రోల్ అధికారులు సూచిస్తున్నారు.

# మాడుగులలో ట్రైయాంగిల్ ఫైట్

విశాఖపట్టణం, మార్చి 5 , ఉమ్మడి విశాఖ జిల్లాలోని మరో నియోజకవర్గం మాడుగుల. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ఉంది. ఈ నియోజకవర్గానికి తొలిసారి 1952లో ఎన్నికలు జరిగాయి. ఇప్పటి వరకు 16సార్లు ఎన్నికలు జరిగాయి. ఆరుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, 4సార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో 2,15,571 మంది ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 1,04,981 మంది, మహిళా ఓటర్లు 1,10,584 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మహిళా ఓటర్లది పైచేయిగా ఉంది. మాడుగుల నియోజకవర్గం 1952లో ఏర్పాటైంది. తొలి ఎన్నికల్లో కేఎల్పీ నుంచి పోటీ చేసిన బీజీ నాయుడు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఐ.సత్యనారాయణపై 3,226 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పీఎస్పీ నుంచి పోటీ చేసిన డీఎస్ మూర్తి తన సమీప ప్రత్యర్థి ప్రజా పార్టీ నుంచి పోటీ చేసిన టి.విశ్వనాథంపై 4,858 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1962లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన తెన్నేటి విశ్వనాథం విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డీఎస్ మూర్తిపై 18,006 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఇదే ఏడాది ఈ నియోజకవర్గాన్ని రెండుగా చేశారు. బొడ్డం పేరుతో ఏర్పాటైన నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహించగా, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఏ.దశావతారం విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి స్వతంత్ర పార్టీ నుంచి పోటీ చేసిన జీబీ అప్పారావుపై 228 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దేవి రమా కుమారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎస్ భూమిరెడ్డిపై 20,257 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కళావతి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎస్ భూమిరెడ్డిపై 5344 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1978లో జరిగిన ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కె రామునాయుడు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన జి ఆదినారాయణపై 437 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణ ఇక్కడ విజయాన్ని దక్కించుకున్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన తన సమీప ప్రత్యర్థి డీఎన్ బొడ్డుపై 16,882 ఓట్ల తేడాతో విజయాన్ని సాధించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణ మరోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కె రామునాయుడపై 28,421 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో మూడోసారి రెడ్డి సత్యనారాయణ గెలుపొందారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కె రామునాయుడుపై 10,084 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణ వరుసగా నాలుగోసారి ఇక్కడ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కేఎస్ అప్పారావుపై 27,091 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 1999లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణ వరుసగా ఐదోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన డి కన్నబాబుపై 5831 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కరణం ధర్మ శ్రీ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన రెడ్డి సత్యనారాయణపై 8737 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన జి రామానాయుడు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఏ రామూర్తి నాయుడు 6827 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బి ముత్యాలనాయుడు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి టీడీపీ నుంచి పోటీ చేసిన జి రామానాయుడిపై 4761 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన బి ముత్యాల నాయుడు మరోసారి విజయం సాధించారు. టీడీపీ నుంచి పోటీ చేసిన జి రామానాయుడుపై 16,392 ఓట్ల తేడాతో విజయాన్ని దక్కించుకున్నారు. గడిచిన ఎన్నికల్లో ఇక్కడ విజయం సాధించి మూడి ముత్యాల నాయుడు వైసీపీ రెండో విడత మంత్రివర్గంలో చేరారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే వైసీపీ నుంచి పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. టీడీపీ నుంచి జి రామానాయుడితోపాటు మరో నేత కూడా ప్రయత్నిస్తున్నారు. జనసేన కూడా ఇక్కడి నుంచి సీటు ఆశిస్తోంది.

# రేవంత్ పైనే కాంగ్రెస్ ఆశలు



విశాఖపట్టణం, మార్చి 5 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడింది. ఆ పార్టీ ఏపీ అధినేత్రిగా వైఎస్ షర్మిల పగ్గాలు చేపట్టిన తరువాత గత పదేళ్లుగా రాష్ట్రంలో కనిపించని కాంగ్రెస్ ఇప్పుడు ఉనికి చాటుకుంటున్న పరిస్థితి. వరుస సభలు, సమావేశాలతో ఆ పార్టీ క్యాడర్ లో జోష్ పుట్టించే ప్రయత్నాలు పెరిగాయి. షర్మిల రాకతో పార్టీలో జోష్ అయితే కనిపించింది కానీ, ఆ జోష్ రాష్ట్రంలో ఏవో కొన్ని స్థానాలలోనైనా పార్టీని విజయం దిశగా నిడిపించేంతగా లేదని పరిశీలకులు అంటున్నారు.ష్ట్రంలో వరుస సభలు, సమావేశాలతో రానున్న ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే కీలక నాయకులతో సభలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. మరో భారీ సభకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 11 నుంచి 13 తేదీల మధ్య విశాఖపట్నంలో న్యాయ సాధన పేరుతో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు సభకు సంబంధించిన వివరాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం విశాఖలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.విశాఖలో నిర్వహిస్తున్న న్యాయ సాధన సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ ముఖ్య నేతలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు ఈ పరిస్థితుల్లో ఈ సారి ఎన్నికలలోనైనా సరే అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉండి తీరాలన్న పట్టుదల ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ హై కమాండ్ షర్మిలకు తోడుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రచార బాధ్యతలు అప్పగించే యోచనలో ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఏపీ స్టార్ క్యాంపెయినర్ గా రేవంత్ రెడ్డికి బాధ్యతలు అప్పగించే నిర్ణయాన్ని ఇప్పటికే కాంగ్రెస్ హై కమాండ్ తీసేసుకుంది. రాష్ట్ర విభజన ముందు వరకూ రాష్ట్రంలో అత్యంత బలంగా ఉన్న కాంగ్రెస్ పరిస్థితి విభజన తరువాత ఉనికి మాత్రంగా మిగిలిపోయిన సంగతి తెలిసిందే. ఆ పార్టీలో సీనియర్లు, క్రియాశీలంగా వ్యవహరించే నేతలూ అందరూ వేరే వేరే పార్టీల్లో సర్దుకున్నారు. అలా సర్దుకోలేనివారు రాజకీయంగా క్రీయాశీలంగా వ్యవహరించడం మానేశారు. కేవీపీ, పల్లంరాజు, రఘువీరారెడ్డి ఇలా పార్టీ వాయిస్ ను గట్టిగా వినిపిస్తారన్న పేరున్న నేతలే కాకుండా, రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించి లగడపాటి, ఉండవల్లి వంటి అంతో ఇంతో ప్రజా సంబంధాలు ఉన్న వారు రాజకీయాలకు దూరమయ్యారు. దీంతో గత పదేళ్లుగా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిపోయింది. పార్టీ కార్యక్రమాలు లేవు. ఒక వేళ ఏమైన కార్యక్రమం తలపెట్టినా చురుకుగా పాల్గొనే నేతలు లేరు, క్యాడర్ లేదు. దీంతో ఆ పార్టీ నామమాత్రంగా మిగిలిపోయింది. ఎన్నికలలో ఆ పార్టీ తరపున పోటీ చేయడానికి అభ్యర్థులే కరవైన పరిస్థితి. ఈ తరుణంలో 2024 ఎన్నికలలో ఎలాగైనా అసెంబ్లీలో ప్రవేశించాలన్న సంకల్పంతో రాష్ట్ర కాంగ్రెస్ కు కాయకల్ప చికిత్స చేస్తున్నది పార్టీ అధిష్ఠానం. ఇందు కోసం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచే వ్యూహారచన ప్రారంభించింది. తెలంగాణ ఎన్నికలకు ముందు షర్మిల తన వైఎస్సార్టీపీని కాంగ్రెస్ లో విలీనం చేసి ఆ రాష్ట్రంలో కీలక పాత్ర

# అనకాపల్లి కూల్ అయినట్టేనా

విశాఖపట్టణం, మార్చి 5 అనకాపల్లి తెలుగుదేశం పార్టీలో నెలకొన్న అసంతృప్తి దాదాపు సద్దుమణిగినట్టు కనిపిస్తోంది. ఈ సీటును పొత్తులో భాగంగా జనసేన పార్టీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ కేటాయించారు. కొణతాలకు సీటు కేటాయించిన విషయం తెలిసిన తరువాత తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఒక్కసారిగా ఆందోళనకు దిగాయి. ఇక్కడి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ ఇంటి వద్దకు చేరుకుని ఆయనకు సంఘీభావం తెలిపారు. పార్టీ అధినాయకత్వ తీరును తీవ్రంగా ఖండించిన పలువురు కార్యకర్తలు పార్టీని వీడాలంటూ గోవింద్‌కు సూచించారు. ఆ దిశగా ఆయన ఆలోచన చేస్తున్నారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. వైసీపీ నుంచి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారంటూ ఊహాగానాలు వినిపించాయి. ఈ తరహా ఊహాగానాలకు చెక్ చెప్పేలా పీలా గోవింద్ సత్యనారాయణ స్పందించారు. తన నివాసం వద్ద బుధవారం సాయంత్రం కార్యకర్తలతో మాట్లాడిన ఆయన.. పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇదే ఇంటిలో.. ఇదే పార్టీలో.. ఇదే కుటుంబంతో ఉంటానని స్పష్టం చేయడం ద్వారా పార్టీలో మారుతున్నట్టు వస్తున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. తనకు టికెట్ రాలేదని కేడర్ ఆందోళన చెందవద్దని, అధినేత, పార్టీపై తూలనాడొద్దు అంటూ కేడర్‌కు గోవింద్ సూచించారు. సంయమనం పాటించాలంటూ కోరారు. 2019లో ఓటమి తరువాత ఇదే ఇంటిలో ఉంటానని తాను చెప్పానని.. ఇప్పటికీ ఉంటున్నానని, భవిష్యత్‌లోనూ ఉంటానని స్పష్టం చేశారు. యలమంచిలి, పెందుర్తికి వెళతానంటూ ప్రచారం జరుగుతోందని.. తానెక్కడా దుకాణం పెట్టనని, ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. సీటుతో తనకు పనికి లేదన్న గోవింద్.. ఎమ్మెల్యే అవుతానని తానెప్పుడూ ఊహించలేదని, చంద్రబాబు దయతో అయ్యానన్నారు. నా తండ్రి మీద అభిమానంతో చంద్రబాబు సీటు ఇచ్చినప్పుడు ఎంతో మంది ఆందోళనలు చేశారని, అయినా చంద్రబాబు పట్టించుకోలేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2019లో ఓడిన తరువాత కార్యకర్తలు ఎంతగా అభిమానిస్తున్నారో అర్థం చేసుకున్నానని.. సీటు వచ్చినా, రాకపోయినా కుటుంబ సభ్యుడిగా ఉంటానని పీలా గోవింద్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని కోపతాపాలతో వీడి వెళ్లేవారికి మనుగడ ఉండదని పీలా గోవింద్ పేర్కొన్నారు. ఒకవేళ వెళ్లినా మళ్లీ ఇదే పార్టీలోకి వస్తారని వెల్లడించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదన్న గోవింద్.. టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అవుతారని.. 2014 నుంచి 2019 వరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నట్టుగానే.. రానున్న ఐదేళ్లు చేసుకుందామని స్పష్టం చేశారు. కొణతాలతో తనకు వైరం లేదని వెల్లడించారు. గతంలో గుడివాడ అమర్ తన ఇంటికి వచ్చాడన్నారు. నాలుగురోజులు ఆగమని చంద్రబాబు చెప్పారన్నారు. స్వప్రయోజనాలు కోసం జెండా మార్చే అలవాటు లేదని, పార్టీకి ఎప్పుడూ ద్రోహం చేయనని స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్, చంద్రబాబు దగ్గర నుంచి తన తండ్రి, తాను పని చేస్తూ వచ్చామని, భవిష్యత్‌లో లోకేశ్ నాయకత్వంలో పని చేస్తామని గోవింద్ స్పష్టం చేశారు. ఐదేళ్లు చాలా కష్టపడ్డామని, 4900 మంది కార్యకర్తలు పింఛన్లు తీసేశారని, ఏ రోజూ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# ఎన్నికల బరిలో లిక్కర్ కింగ్స్

ఒంగోలు, మార్చి 5 ఎన్నికలు సమీపిస్తున్నాయి.. అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు సీరియస్ కసరత్తులు చేస్తున్నాయి. ఆ క్రమంలో అంగ బలం, అర్థం బలం ఉన్నవాళ్లకు ఆ యా పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. అయితే శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్లి వచ్చిన వారి పేర్లను సైతం అభ్యర్థులుగా ప్రకటించే పనిలో పార్టీలు ఉన్నాయనే ఓ ప్రచారం పొలిటికల్ సర్కిల్‌లో వైరల్ అవుతోంది. నెల్లూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా శరత్ చంద్రారెడ్డిని ఎంపిక చేసినట్లు ఇప్పటికే అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన.. వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి సమీప బంధువు. అంతేకాదు ఢిల్లీ లిక్కర్ స్కామ్ ప్రధాన నిందితుల్లో ఆయన ఒకరు. అయనపై సీబీఐ, ఈడీ కేసు నమోదు చేశాయి. ఈ కేసులో ఆయన తీహార్ జైలుకు వెళ్లి, అప్రూవర్‌గా మారి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే స్కామ్‌లో సౌత్ గ్రూప్ తరపున ఆయన అన్నీ తానై వ్యవహరించారన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. అయితే.. నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉన్నఅనిల్ కుమార్ యాదవ్‌ను నరసారావుపేట ఎంపీగా బరిలో దిగుతుండగా, నెల్లూరు జిల్లాలోని పలువురు వైసీపీ ఎమ్మెల్యేలు ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి.. తెలుగుదేశంలోకి జంప్ కొట్టేశారు. అలాగే ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ బాబాయి రూప్ కుమార్‌తో పాటు పలువురు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు సైతం.. వైసీపీకి బై బై గుడ్ బై చెప్పేసి.. త్వరలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రకటిస్తామని ప్రకటించేశారు. ఇక జగన్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా పార్టీని వీడడంతో.. నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ పార్టీ పరిస్థితి పూర్తి అధ్వానంగా మారిపోయింది. దాంతో ఎంపీగా శరత్ చంద్రారెడ్డిని బరిలో దింపేందుకు తాడేపల్లి ప్యాలెస్‌లోని పెద్దలు పావులు కదుపుతోన్నట్లు తెలుస్తోంది.నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ పరిస్థితి ఇలా ఉంటే.. ఆ పక్కనే ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి.. వైసీపీకి రాం రాం చెప్పేయడమే కాదు, రానున్న ఎన్నికల్లో తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి ఒంగోలు ఎంపీగా బరిలో దిగుతున్నారని.. అయితే ఆయన ఏ పార్టీ తరపున బరిలో దిగేది త్వరలో వెల్లడిస్తామని ప్రకటించారు. ఇక ఈ మాగుంట రాఘవరెడ్డి కూడాఈ కేసులో తీహార్ జైలుకు వెళ్లి వచ్చారు. అయితే ఈ కేసులో తన కుమారుడిని బయటకు తీసుకు రావడంలో అధికార జగన్ పార్టీ ప్రత్యేక శ్రద్ద పెట్ట లేదంటూ.. మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆడపా దడపా తన అనుచరుల వద్ద గోడు వెళ్ల బోసుకోనే వారని.. ఆయన వైసీపీకి రాజీనామా చేయడానికి అది కూడా ఒక కారణమని పొలిటికల్ సర్కిల్‌లో ఓ ప్రచారం జరుగుతోంది. మరో వైపు.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులుగా మాగుంట రాఘవరెడ్డి, శరత్ చంద్రారెడ్డికి టికెట్లు కేటాయిస్తే.. వారు గెలుస్తారా? అనే ఓ చర్చ సైతం వాయువేగంతో పొలిటికల్ సర్కిల్‌లో వైరల్ అవుతోంది.

# తెరపైకి కాపు వర్సెస్ కమ్మ వివాదం

రాజమండ్రి, మార్చి 5 ఏపీలో కూటమి గ్రాండ్ సక్సెస్ అవుతుందని టిడిపి, జనసేన భావిస్తున్నాయి. కానీ కేవలం 24 అసెంబ్లీ స్థానాలకే జనసేన పరిమితం కావడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. తద్వారా కాపు సామాజిక వర్గం ఓటు బదలాయింపు జరగదన్న విశ్లేషణలు ఉన్నాయి. దీనిని తప్పుపడుతూ కాపు సంఘం నేతలు పెద్ద ఎత్తున లేఖాస్త్రాలు సంధించారు. అయినా సరే పవన్ ఫుల్ క్లారిటీ ఇచ్చారు. తనతో ఉన్నవారే తనవారని.. ఇష్టం లేని వాళ్ళు బయటకు వెళ్ళిపోవచ్చు అని కూడా తేల్చి చెప్పారు. దీంతో హరి రామ జోగయ్య, ముద్రగడ కుటుంబాలు వైసీపీ వైపు వెళుతున్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే కుల చిచ్చు రగిలించే అనేక ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని టార్గెట్ చేసుకొని కాపు, కమ్మ కులాల మధ్య అంతరం పెంచేలా చర్యలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీ వ్యవస్థాపక సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిట్టింగ్ లందరికీ టిడిపి టికెట్లు ఇస్తామని గతంలో చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు పొత్తులో భాగంగా ఆ సీటును జనసేన ఆశిస్తుండడంతో వివాదం ప్రారంభమైంది. మొన్నటికి మొన్న పవన్ కళ్యాణ్ ఈ నియోజకవర్గ విషయంలో క్లారిటీ ఇచ్చారు. ఇక్కడ జనసేన అభ్యర్థి పోటీలో ఉంటారని తేల్చేశారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన కందుల దుర్గేష్ ను అభ్యర్థిగా ప్రకటించారు. అప్పటినుంచి వివాదం ప్రారంభం అయ్యింది.గోరంట్ల బుచ్చయ్య చౌదరి కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేత. దుర్గేష్ కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఇద్దరూ బలమైన నేతలే. ఎవరు పోటీ చేసినా పొత్తులో భాగంగా తప్పకుండా గెలుపొందుతారు. దీంతో టిక్కెట్ కోసం ఇద్దరు నాయకులు పట్టుబడుతున్నారు. తమ అధినేతలపై ఒత్తిడి పెంచుతున్నారు. అయితే చంద్రబాబు సూచన మేరకు పవన్ దుర్గేష్ తో మాట్లాడారు. రాజమండ్రి రూరల్ బదులు నిడదవోలు టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే తన అనుచరులతో మాట్లాడి చెబుతానని దుర్గేష్ పవన్ తో అన్నారు. రోజులు గడుస్తున్న దుర్గేష్ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆయన సైతం రాజమండ్రి రూరల్ నియోజకవర్గం విషయంలో పట్టుతో ఉన్నట్లు సమాచారం. దీంతో ఇక్కడ కుల రాజకీయాన్ని ప్రత్యర్థులు తెరపైకి తీసుకురావడం ఉభయ పార్టీల్లో ఆందోళన కలిగిస్తోంది.వాస్తవానికి తెలుగుదేశం పార్టీతో జనసేన పొత్తును అధికార పార్టీ వ్యతిరేకించింది. పొత్తు కుదరకూడదని భావించింది. ఒకవేళ కుదిరినా సీట్ల సర్దుబాటు దగ్గర వివాదంసృష్టించడానికి ప్రయత్నించింది. సీట్ల సర్దుబాటు ఓట్ల బదలాయింపు సక్రమంగా జరగకూ డదని భావిస్తోంది. కాపు సంఘాల నేతల లేఖలు వెనుక వైసిపి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. హరి రామ జోగయ్య లేఖలు ఎలా రాస్తారని.. అవి వైసిపి కార్యాలయం నుంచి వచ్చినవని అనుమానాలు ఉన్నాయి.

# ఆ ముగ్గురు ఓటమే లక్ష్యంగా...

విజయవాడ, మార్చి 5 ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికార వైసీపీ.కొందరు నేతలను ఓటమే లక్ష్యంగా పావులు కదుపుతోందా ? పార్టీని వీడిన ఆ ముగ్గురు నేతలను ఓడించేందుకు ముప్పేట దాడి చేయాలని నిర్ణయించిందా ?అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. కృష్ణా జిల్లాలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వారిపై అధికార పార్టీ ప్రత్యేక ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. టీడీపీ–జనసేన కూటమి తరపున బరిలోకి దిగుతున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి, నూజివీడు సిట్టింగ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ను ఓడించాలన్న లక్ష్యంతో వైసీపీ హైకమాండ్ వ్యూహాలు రచిస్తోం ది.వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడంతో... ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టార్గెట్ గా విమర్శలు చేయడం ఆ పార్టీ అధిష్ఠానానికి ఆగ్రహం తెప్పించినట్లు తెలుస్తోంది.ముగ్గుర్ని ఎలాగైనా ఓడిం చాలని, అన్ని అస్త్రాలు ప్రయోగించేందుకు రెడీ అయినట్లు సమాచారం. జిల్లాలోని మైలవరం, పెనమలూరు అసెంబ్లీ స్థానాలతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ స్థానాల్లో... ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో వైసీపీ హైకమాండ్ ఉన్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. వైసీపీ నుంచి గెలిచిన ముగ్గురు నేతలు పార్టీని వీడే సమయంలో విమర్శలు చేసిన నేతలను ఎన్నికల్లో ఖచ్చితంగా ఓడించాలని కేడర్ కు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మాజీ మంత్రి పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి... జిల్లా నుంచి మొట్టమొదట పార్టీ అధిష్టానంపై అసమ్మతి గళం వినిపించారు. ఈసారి పెనమలూరు నుంచి కాకుండా నూజివీడు నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తున్నారు. ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బరిలోకి దిగడం ఖాయమైంది. యాదవుల ఓట్లు ఎక్కువగా ఉండటంతో...పార్థసారథి నూజివీడుకు షిఫ్ట్ అయ్యారు. అయితే పార్థసారథిని ఓడించేందుకు వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఇన్ చార్జ్ గా పనిచేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు టికెట్ దక్కకపోవడంతో... సీఎం జగన్ ను కలిశారు. ఆయన వైసీపీలో చేరుతారని భావించారు. అయితే మద్దరబోయిన వైసీపీలో చేరకపోవడానికి కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ముద్దరబోయిన వెంకటేశ్వరరావును ఇండిపెండెంట్ గా పోటీ చేయించి... ఓట్లను చీల్చాలన్న లక్ష్యంతో వైసీపీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ ఓట్లు చీల్చడం ద్వారా పార్థసారథిని ఓడించవచ్చనే ప్లాన్ చేస్తోంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్... ఇటీవల చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మైలవరంలో టీడీపీ అభ్యర్థిగా వసంత పోటీ చేయడం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఐదేళ్ళ పాటు వైసీపీలో ఉన్న వసంత... మంత్రి జోగి రమేష్ తో విభేదాలు ఉన్నాయి. అనేక అంశాల్లో ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ... టీడీపీ కండువా కప్పుకున్నారు.

## మాధవరం చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేసిన కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్



విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 05-అక్రమ రవాణ కట్టడికి పకడ్బందీ చర్యలు చేపట్టాలి. ప్రతి వాహనం ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని చెక్ పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు చేయాలి.ఎన్నికలుసమీపిస్తున్నందున అంతర్ రాష్ట్ర సరిహద్దు లో ఉన్న మంత్రాలయ మండలం, మాధవరం పోలీసు స్టేషన్ పరిధిలోని మాధవరం చెక్ పోస్టు (కర్ణాటక బార్డర్ ) ను కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సృజన గారితో కలిసి స్ట్రాంగ్ రూమ్ లను, పార్కింగ్ ప్రదేశాలనుపరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి సూచనలు చేశారు. డబ్బు, అక్రమ మద్యం రవాణా జరగకుండా కట్టడి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసులు అక్రమ రవాణా పై నిఘా ను పటిష్టం చేయాలని జిల్లా ఎస్పీ తగు సూచనలు చేశారు. పకడ్బందీగా వాహనాల తనిఖీలు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ గారి వెంట ఎమ్మిగనూరు డిఎస్పీ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీనివాస రెడ్డి, మంత్రాలయం సిఐ ఎరిషావలి, కోసిగి సిఐ ప్రసాద్, ఎస్సైలు ఉన్నారు.

## నేడు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాల కు రాక

**అభిరుచి మధు బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 05-. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నంద్యాల కు బుధవారం వస్తున్నట్లు నంద్యాల బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి 9 గంటలకు నంద్యాల లోని బిజెపి పార్లమెంట్ ఎన్నికల కార్యాలయానికి చేరుకుంటారని అన్నారు.కాసేపు కార్యకర్తలతో మాట్లాడి 100 వాహనాలతో సూరజ్ గ్రాండ్ వరకు ర్యాలీ వుంటుందని అన్నారు .సమావేశంలో 7 నియోజక వర్గాలకు చెందిన బిజెపి అసెంబ్లీ కన్వీనర్ లు,ముఖ్యనేతలతోవిడి,విడిగాసమావేశం జరుగు తుందని అన్నారు. బిజెపి భవిషత్తు ప్రణాళిక, నాయకులు ,కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తారు అన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ పధకం - పైన అవగాహన సదస్సు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 05- బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీ స్వామి వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల నందు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పైన భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలోని, ఎమ్ఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆఫీస్, విశాఖపట్నం మరియు జిల్లా పరిశ్రమల శాఖ (డిఐసి), డిఆర్డిఎ డిపిఓనంద్యాల జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగనుంది. స్వయం ఉపాధి ప్రాతిపాదికన రంగంలో పైన పేర్కొన్న కుటుంబ ఆధారిత వ్యాపారాలలో నిమగ్నమైన చేతులు మరియు పనిముట్లతో చేసే చేతి వృత్తిదారుల కొరకు అవగాహన సదస్సు నిర్వహించబ డుతుంది. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పధకం రిజిస్ట్రేషన్ చేయబడుతుంది కావున సంబంధిత కులవృత్తిదా రులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రధానమంత్రి విశ్వకర్మ పథకము ద్వారా వచ్చే లబ్ధిని పొందగలరు. ఇతర వివరాల కొరకు డి.వి.ఎస్.ఆర్. మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వారి ఫోన్ నెంబర్ 9492689462 కు సంప్రదించగలరు.

## రాజకీయ నాయకులు పార్టీలు మారడం ప్రజల సంక్షేమం కోసమా "లేక" వారి స్వలాభం కోసమా పలువురికి సందేహాలు





-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 06- రాజకీయ నాయకులు ప్రజల సంక్షేమం కోసమా లేక వారి స్వలాభం కోసమా వివిధ పార్టీ కండువాలు మార్చుతూ ఉ ంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నంద్యాల జిల్లా లో నంద్యాల యందు పార్టీ మారకుండా ఉన్న ఏకైక అభ్యర్థి ఎన్ ఎమ్ డి ఫరూక్ మాత్రమే. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఒకే పార్టీ లోనే ఎన్ ఎమ్ డి ఫరూక్ కొనసాగుతున్నారు . "శిల్పా కుటుంబం" శిల్పా మోహన్ రెడ్డి . మరియు శిల్పా చక్రపాణి రెడ్డి. మొదట కాంగ్రెస్. తర్వాత టిడిపి. మళ్లీ వైసీపీ. ఇలా పార్టీ కండువాలు మార్చుతూ రాజకీయాలు చేస్తున్నారు . అలాగే "భూమ కుటుంబం" . టిడిపి. ప్రజారాజ్యం. వైసీపీ. టిడిపి. పార్టీలు మారారు . "గంగుల కుటుంబం" కాంగ్రెస్. బిజెపి. వైసీపీ. పార్టీలు మారారు "కాటసాని కుటుంబం" కాంగ్రెస్. ప్రజారాజ్యం. బిజెపి వైసీపీ. పార్టీలు మారారు . "కోట్ల కుటుంబం" కాంగ్రెస్. టిడిపి. పార్టీ లు మారారు. "బైరెడ్డి కుటుంబం" టిడిపి. బిజెపి. టిడిపి. ఇలా పార్టీలు మారుతునే ఉన్నారు . పార్టీ సిద్దాంతలతో ప్రజల అభిప్రాయాలతో పరిగణనలోకి తీసుకొని పార్టీ లు మారడం లేదని తెలుస్తోంది, ఎక్కువ మంది రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసమే పార్టీలు మారుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు .

## రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 05-38వ వార్డు వైస్సార్ నగర్ లో 22 మంది పేదల చిరకాల కోరికను కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక ఇంటి పెద్దగా, అన్నగా, బిడ్డగా బాధ్యతను తీసుకొని నిరుపేదలందరికి సొంత ఇంటి స్థలాలన్ని కేటాయించి అలాగే ఆస్థలాలను వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని 38వ వార్డు ఇంఛార్జ్ టి.వి.రమణ పేర్కొన్నారు. మంగళవారం నాడు వార్డు పరిధిలో 22 మంది లబ్దిదారులకు ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టి.వి.రమణ మాట్లాడుతూ... జగనన్న ప్రభుత్వంలో పేదలందరికి ఇళ్లు పంపిణీ చేయాలన్న ఒక గొప్ప సదాశయంతో ఇంటి స్థలాలను కేటాయించడమే కాకుండా వారి పేరు మీద ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి సంబంధించిన పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ విధంగా గతంలో ఏప్రభుత్వం చేయలేదని, తమకు ఇచ్చిన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను తమ పేరున రావడం, భవిషత్తులో అవసరాలను తీర్చేందుకు ఒక భరోసాగా ఉంటాయని లబ్దిదారులు తెలియజేశారు. దశాబ్దాల కాలం నుండి సొంత ఇంటి స్థలాల కోసం ఎదురు చూశామని నేడు జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ గారి సహకారంతో వార్డు కౌన్సిలర్ టి.సావిత్రమ్మ మరియు ఇంఛార్జ్ టి.వి.రమణ గార్ల కృషితో తమ చిరకాల కల నెరవేరిందని లబ్ధిదారులు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేసారు..

## అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మీయ సమావేశం



నంద్యాల జిల్లా 05-03-2024, నంద్యాలలోబొమ్మల సత్రంలోని సి పి ఆర్ గ్రాండ్ లాడ్జిలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు కలిసి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులందరం వైసిపి ప్రభుత్వానికి సపోర్ట్ చేశామని కానీ ప్రభుత్వం తమని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు వైసిపి ప్రభుత్వం 10% కూడా న్యాయం చేయలేదని, 1150 కోట్ల రూపాయలు బాధితులందరికీ ఇస్తుందని వైసీపీ ప్రభుత్వం మాట చెప్పి 250 కోట్ల మాత్రమే బాధితులకు పంచారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ మాట తప్పను మడమ తిప్పను అని చెప్పి మాట తప్పారని ఎద్దేవా చేశారు. అగ్రిగోల్డ్ బాధితులందరికీ డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరిగి ఇవ్వని పక్షంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో అగ్రిగోల్డ్ బాధితుల తరపున పోటీ చేస్తామని, సమస్యలను పరిష్కరించకపోతే వైసీపీ ప్రభుత్వం ఓట్లు చీల్చి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. సమావేశంలో అగ్రిగోల్డ్ బాధితుల తరపున అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సెక్రటరీ అయిన బచ్చు శ్రావణ కుమారును నంద్యాల అసెంబ్లీ అభ్యర్థిగా ఇండిపెండెంట్ గా పోటీ చేయనున్నట్లు అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు ఆదాం సాహెబ్, గౌరవ అధ్యక్షులు మనోహర్ రాజు తెలిపారు.

## ఆసుపత్రిలో ఆలీ భాయ్

**ఆపన్న హస్తం కోసం ఎదురు చూపు • చిన్న సాయం అందిద్దాము పెద్ద మనసుని చాటుకుందాం • ఆలీ భాయ్ కోసం దాతలను వేడుకుంటున్న స్ఫూర్తి సేవా సమితి**




డోన్ మార్చ్ 5 నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో గల త్రివర్ణ కాలనీకి చెందిన ఆలీ భాయ్ అనే 64 ఏళ్ల వృద్ధుడు ఒక అద్దె ఇంట్లో వుంటూ మసీదుల్లో అల్లా సేవ చేసుకుంటూ పొట్ట కూటి కోసం ప్లాస్టిక్ ఫ్యాక్టరిలో పని చేసుకుంటూ తన భార్య, ఇద్దరు ఆడ పిల్లలతో (అందులో ఒకరు వికలాంగురాలు) చాలీ చాలని జీవితం గడిపేవారు. విధి ఆడిన వింత నాటకంలో అతడికి కిడ్నీ లివర్ జబ్బు చేయడం వల్ల ఆసుపత్రి లో అడ్మిట్ అయ్యాడు.మా మనిషి ఆరోగ్య పరిస్థితి బాలేదు.ఆసుపత్రిలో వున్నాము మాకు కొంత ఆర్థిక సాయం కావాలని ఆలీ భాయ్ భార్య, పిల్లలు స్ఫూర్తి సేవా సమితి ద్వారా దాతలను సాయం కోరుతున్నారు. ఆసుపత్రి పాలైన ఆలీ భాయ్ కి మనవంతు సాయం అందిద్దాం చేయి చేయి కలుపుదాం ఆలీ భాయ్ ని ఆదుకుందాంమీ స్ఫూర్తి మధు స్ఫూర్తి సేవా సమితి డోన్ 7989474725

## జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



మహానందిలో గల కుమ్మరి శాలివాహన కళ్యాణ మండపం నందు నవరత్నాలలో పథకాలలో భాగంగా పేదలందరికీ పక్కా ఇళ్లు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు, జగనన్న కాలనీ నందు ఇంటి స్థలాలు మంజూరు అయిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శిల్పా రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు,ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడమే కాకుండావాటికి రిజిుస్ట్రేషన్లు కూడా చేయడం ద్వారా ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి కొత్త చరిత్ర సృష్టించారన్నారు, దేశంలోనే పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరు మీద రిజిస్టర్ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ని తెలిపారు.ఈయొక్క కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర రెడ్డి, మహానంది మండలం ప్రజా ప్రతినిధులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి అసెంబ్లీ బరిలో టీడీపీనా.. జనసేనా..?

**అభ్యర్థుల ఎంపికపై తీవ్ర ఉత్కంఠ..**




తిరుపతిమార్చి 05 ( విభారే) : టెంపుల్ సిటీలో టిడిపి పోటీలో లేనట్టేననిపిస్తోంది. తిరుపతి నుంచి పోటీకి జనసేన పట్టు పడుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ పోటీ చేస్తారని ముందు నుంచి జరుగుతున్న ప్రచారపై స్పష్టత లేకపోయినా బలమైన అభ్యర్థి కోసం మాత్రం జనసేన కసరత్తు చేస్తోంది.బలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి కోసం ప్లాన్ చేస్తున్న జనసేన.. లోకల్ లేకపోతే నాన్ లోకల్?కు ట్రై చేస్తోంది. జనసేన పరిశీలనలో ఇప్పటికే ఉ మ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన బలిజ నేతల పేర్లు పరిశీలనలో ఉండడంతో తిరుపతి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్న టిడిపి ఆశావాహుల్లో గందరగోళం నెలకొంది. జనసేన ప్రయత్నాలతో టిడిపి అశావాహుల్లో నిరుత్సాహం నెలకొంది.తిరుపతి ఆధ్యాత్మికంగానే కాదు రాజకీయంగా కూడా ప్రాధాన్యత ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్. ఎన్టీఆర్, చిరంజీవి లాంటి సినీ రంగ ప్రముఖులను అసెంబ్లీకి పంపిన తిరుపతి నియోజకవర్గం అన్ని పార్టీలకు సెంటిమెంటే. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికలు కీలకంగా మారాయి. వైసీపీకి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుపతి ఈ ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థిని అధిపతి చేస్తుందో అన్న ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికలకు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దూరంగా ఉండగా ఆయన కొడుకు వారసత్వం అందిపుచ్చుకున్నారు. తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్?గా కొనసాగుతున్న భూమన అభినయ్ వైసీపీ సమన్వయకర్తగా బరిలో ఉన్నారు. ఇప్పటికే వైసీపీ అధిష్టానం కూడా భూమన అధినయ్?ను తిరుపతి అభ్యర్థిగా ప్రకటించగా పెద్ద ఎత్తున ప్రచారం కూడా ప్రారంభమైంది.డిప్యూటీ మేయర్?గా రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధితోపాటు మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి రూపురేఖలను మార్చామంటూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు అభినయ్. ఆత్మీయ సమావేశాలులతో వైసీపీ దూకుడు ప్రదర్శిస్తుండగా ప్రతిపక్షంలో ఉలుకు పలుకు లేని స్తబ్ధత నెలకొంది. పొత్తుల అంశంతో పేచీ ఏర్పడింది. టిడిపితో జత కట్టిన జనసేన, కూటమిలో బిజెపి పొత్తు ఉ ంటుందన్న ప్రచారం కొలిక్కి రాకపోవడంతో ప్రత్యర్థిగా నిలిచే పార్టీ ఏదన్న దానిపై స్పష్టత రావడంలేదు. అయితే టిడిపి జనసేన తొలి ఉమ్మడి జాబితా ప్రకటన తర్వాత తిరుపతి నుంచి జనసేననే పోటీలో ఉంటుందన్న ప్రచారం జోరందుకుంది. ఉమ్మడి అభ్యర్థిగా తిరుపతి నుంచి జనసేనాని పవన్ కళ్యాణ్?ని పోటీ చేయించాలని టిడిపి హై కమాండ్ కూడా ఒత్తిడి తెస్తోందన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగింది. ఈ విషయంపై పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇవ్వకపోయినా టెంపుల్ సిటీలో జనసేననే పోటీలో ఉండాలన్న దానిపై ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది.2009లో ప్రజారాజ్యం అధినేతగా చిరంజీవి తిరుపతి నుంచి పోటీ చేసి గెలవడం, మరోవైపు బలిజ సామాజిక వర్గం అధికంగా ఉన్న తిరుపతిలో పవన్ కళ్యాణ్?కు సంపూర్ణ మద్దతు ఉంటుందన్న అభిప్రాయం తిరుపతిలో జనసేన పోటీ చేసేందుకు కారణమన్న అభిప్రాయం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున వినిపిస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190